www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 29 నవంబర్ 2023
5
అన్నమయ్య

అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే : కలెక్టర్

6లో

పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

నాణ్యమైన విద్యుత్ సరఫరానే లక్ష్యం

- ఉప కేంద్రాల ప్రారంభోత్సవంలో కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రాయచోటి

వ్యవసాయ, గృహ రంగం అవసరాలు తీర్చడంతోపాటు నాణ్యమైన విద్యుత్ సరఫరాతో ఆ ప్రాంతం అభివృద్ధి చెందేందుకు 132-33 కెవి విద్యుత్ ఉపకేంద్రాలు ఎంతో ఉపయోగపడ తాయని కలెక్టర్ గిరీష, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి అన్నమయ్య జిల్లాకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్ మిషన్ కార్పొరేషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం గాలివీడు, టి.సుండుపల్లి మండలాలలో నూతనంగా నిర్మించిన రెండు 132-33కెవి విద్యుత్తు ఉప కేంద్రాలు, సంబంధిత లైన్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వర్చువల్‌గా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా గాలివీడులో నూతనంగా నిర్మించిన 132-33 కెవి విద్యుత్తు ఉప కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ గిరీష, ఎమ్మెల్యేతోపాటు జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, రాయచోటి ఆర్‌డిఒ రంగస్వామి, ఎంపిపి చల్లా పద్మావతమ్మ, స్థానిక సర్పంచ్ హాజరయ్యారు. ముఖ్య మంత్రి వర్చువల్ కార్యక్రమం ముగిసిన అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్ర మంలో కలెక్టర్ మాట్లాడుతూ గాలివీడులో రూ.28.44 కోట్లు, టి.సుండుపల్లిలో రూ.28.35 కోట్ల వ్యయంతో నూతనంగా 132-33కెవి విద్యుత్తు ఉప కేంద్రం, సంబంధిత లైన్లను ఏర్పాటు చేశారన్నారు. గాలివీడు, టి.సుండుపల్లి ప్రాంతాలలో అభివృద్ధి చెందుతున్న వ్యవసాయ, గృహరంగం అవసరాలను తీర్చేందుకు 132-33 కెవి విద్యుత్ ఉపకేంద్రాలు ఏర్పాటు చేశారని చెప్పారు. గాలివీడు విద్యుత్ ఉపకేంద్రం ద్వారా గాలివీడు, రామాపురం, లక్కిరెడ్డిపల్లె మండలాలు, టి.సుండుపల్లి విద్యుత్ ఉపకేంద్రం ద్వారా టి సుండుపల్లి, సంబేపల్లి, వీరబల్లి మండలంలోని కొన్ని ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఏర్పడిందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు లక్ష్యంగా వ్యవసాయ రంగానికి పగటిపూట తొమ్మిది గంటలు నాణ్యమైన నిరంతర విద్యుత్ అందించడమే ప్రభుత్వ ఏకైక లక్ష్యమన్నారు. రాష్ట్రంలో కాలుష్యం లేని విద్యుత్ ఉత్పత్తిని సాధించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. 132 -33 కెవి విద్యుత్ ఉప కేంద్రాల ఏర్పాటు ద్వారా గృహ, ఇతర రంగాలకు మెరుగైన విద్యుత్తును అందించే అవకాశం ఏర్పడిందన్నారు. లో ఓల్టేజ్ సమస్య పరిష్కారం తోపాటు విద్యుత్ సరఫరా లో నష్టాలు, అంతరాయాలు తగ్గుతాయని చెప్పారు. అనంతరం ఉప కేంద్రం అవరణలో ఏర్పాటు చేసిన గాలివీడు, టి.సుండుపల్లి 132-33కేవీ విద్యుత్ ఉప కేంద్రాల ప్రారంభోత్సవ శిలాఫలకాలను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో విద్యుత్ ఎస్ఇ బాబు రాజేంద్ర, ఇఇ చంద్రశేఖర్ రెడ్డి, డిఇఇ అచ్యుత రెడ్డి, విజయ్ కుమార్‌రెడ్డి, సోలార్ పవర్ డిఇఇ శివశంకర్ నాయుడు, తహశీల్దార్ దైవా దీనం, ఎంపిడిఒ శేఖర్ నాయక్, విద్యుత్ శాఖ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

ఉప కేంద్రాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ గిరీష

సెక్టోరల్ అధికారులదే కీలక పాత్ర

- కలెక్టర్ గిరీష, ఎస్‌పి కృష్ణారావు

ప్రజాశక్తి-రాయచోటి

ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారులు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని కలెక్టర్ గిరీష సెక్టోరియల్ అధికారులకు సూచించారు. మంగళ వారం పట్టణంలోని నారాయణ కల్యాణ మండపంలో ఎస్‌పి కృష్ణారావుతో కలిసి వచ్చే సాధారణ ఎన్నికల నిర్వహణపై సెక్టార్ ఆఫీసర్లు, పోలీస్ సెక్టార్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని ఎన్నికలకు సంబంధించిన ప్రతి అంశాన్ని సీరియస్గా తీసుకొని పనిచేయాలన్నారు. ఎన్నికలు జరిగే సమయంలోఎక్కడ ఏమి జరిగినా వెంటనే ఇన్సిడెంట్ రిపోర్టు తమకు పంపాలని పేర్కొన్నారు. అబ్జర్వర్‌లకు కూడా మీరే అన్ని వివరాలు తెలియజేయాల్సి ఉంటుందని తెలిపారు. పోలింగ్ పూర్తయి బ్యాలెట్ బాక్సులు స్ట్రాంగ్ రూమ్ వరకు తీసుకొచ్చే పూర్తి బాధ్యత మీరే తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం సెక్టోరియల్ అధికారులకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపు, వీల్ చైర్స్, విద్యుత్, తాగునీరు మరుగుదొడ్లు, వెబ్ క్యాసిటింగ్ చేయుటకు అవసరమైన విద్యుత్ సౌకర్యాలు ఉన్నాయా, లేవని పరిశీలించి ఆ రిపోర్టును కలెక్టర్ కార్యలయానికి అందజేయాలని పేర్కొన్నారు. వల్నరబిలిటి, క్రిటికల్, సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలను గుర్తించి వెంటనే తమకు రిపోర్టు పంపాలన్నారు. సెక్టోరల్ అధికారులు ప్రణాళికాబద్ధంగా అన్ని ముందస్తు ఏర్పాట్లు చూసుకొని మీకు కేటాయించిన రూటు, పోలింగ్ స్టేషన్ లను ముందస్తుగా పరిశీలించాలన్నారు. ఓటు వేయడానికి వచ్చే ఓటర్లకు స్వేఛ్ఛ వాతావరణం కల్పించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేటట్లు చూడాలన్నారు. రూట్ మ్యాపు సెక్టార్ మ్యాపు మీ సంబంధిత తహసిల్దార్ తో సంప్రదించి తయారు చేసుకోవాలన్నారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత పి ఓ,డైరీ,బ్యాలెట్ పేపర్స్ అకౌంట్ అన్ని సక్రమంగా ఉన్నాయా లేదా పరిశీలించి రిసెప్షన్ కేంద్రంలో అందజేయాలన్నారు. పిఒలు, ఎపిఒలకు సంబంధించిన ఫోన్ నెంబర్లను సెక్టోరియల్ అధికారుల వద్ద ఉంచుకోవాలన్నారు. జిల్లాలో 1607 పోలింగ్ కేంద్రాలు, 620 మంది సెక్టార్ అధికారులు పనిచేయడం జరుగుతుందని వీరందరూ తమకు కేటాయించిన విధులు సక్రమంగా నిర్వహించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఎస్‌పి కృష్ణారావు మాట్లాడుతూ పోలీస్ సెక్టార్ అధికారులు పోలింగ్ కేంద్రాలలో సౌకర్యాలు పక్కాగా ఉండేటట్లు చూడాలన్నారు. సెక్టర్ అధికారులకు కేటాయించిన విధులు సక్రమంగా నిర్వహిస్తే ఎన్నికలను విజయవంతం చేయవచ్చునని ఇప్పటి నుంచే మీకు కేటాయించిన ప్రతి పోలింగ్ స్టేషన్ను విసిట్ చేసి అక్కడ ఉండాల్సిన కనీస వసతులు ఉండేటట్లు చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఎటువంటి సమస్యలున్నా వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయగలరు. ఈ ఎన్నికలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికలలో ఓటు వేసే ఓటర్లు ఓటర్ స్లిప్‌తో పాటు రేషన్ కార్డు, ఓటర్ కార్డు, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, పోస్ పోర్టు, ఎంప్లాయ్ ఐడి కార్డు, ఏదైనా ఒకటి గుర్తింపు కార్డుతో వచ్చి ఓటు హక్కును వినియోగించుకునేటట్లుచూడాలని పేర్కొన్నారు. ఓటు వేయడానికి వచ్చిన ఓటర్లకు స్వేచ్ఛవాతావరణం కల్పించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. ఓటర్లపై అధికంగా ప్రభావం చూపే సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి నివేదిక ఇవ్వాలన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో జరిగిన సంఘటనలు, బైండోవర్ వివరాలను గుర్తించి ఈసారి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష, చిత్రంలో ఎస్‌పి కృష్ణారావు

ప్రజా పక్షపాతి సిఎం జగన్ : 'చింతల'

బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

నూతన సంస్కరణలతో ముందుకు వెళుతున్న ప్రజా పక్షపాతి ముఖ్యమంతి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన మండలం, తలపుల పంచాయతీ, మేకల వడ్డిపల్లి, సాములవారిపల్లె, వరగంరెడ్డిగారిపల్లెలో విస్తృతంగా పర్యటించారు. ప్రభుత్వం ద్వారా అందిన పథకాలు లబ్దిదారులకు చదివి వినిపించారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉన్నాయా అని వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందరరేగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో వంద శాతం నెరవేర్చిన ఘనత జగన్ కే దక్కిందన్నారు. సంక్షేమ పథకాలు యదావిధిగా కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లోనూ జగనన్ను ముఖ్యమంత్రిగా గెలిపించు కోవాలన్నారు. ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని కోరారు. ప్రజల నుంచి వచ్చిన విన్నపాలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఏటి రత్న శేఖర్‌రెడ్డి, జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు ఎస్ఎండి షఫీ, సర్పంచ్లు శిరీష. జగన్మోహన్రెడ్డి, ఎంపీటీసీ వెంకటరమణనాయుడు, తలుపుల మాజీ సర్పంచ్ మస్తాన్, తిమ్మయ్య ఇతర నాయకులు చక్రపాణిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, సురేంద్రనాయుడు, పంచాయతీరాజ్ అధ్యక్షుడు డాక్టర్ షేక్ హబీబ్ బాష, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఆహ్లాదాన్నిచ్చేలా నగరవనాన్ని తీర్చిదిద్దాలి

నగర వనంలో పనులను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి -రాయచోటి

రాయచోటికి మణిహారంలా సందర్శకులకు ఆహ్లాదం, ఆరోగ్యం అందించేలా నగరవనం నిర్మాణాలు అభివృద్ధి చేయాలని కలెక్టర్ గిరీష, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి పట్టణం ఎగువ అబ్బవరం సమీపంలో 80 ఎకరాల సువిశాల స్థలంలో నిర్మితమవుతున్న నగరవనానికి అనుసంధానంగా ఎండపల్లి పంచాయతీ ముసలిరెడ్డిగారి పల్లె ఒంటిమాను చెట్టు వద్దనున్న కదిరి రహదారి నుంచి రూ.34 లక్షల డిఎంఎఫ్ నిధులతో చేపట్టి పూర్తయిన రహదారిని వారు ప్రారంభించారు. అనంతరం నగరవనం పనులను అధికారులలో కలసి పరిశీలించారు. నగరవనం నిర్మితమవుతున్న ప్రాంతాలను కలియ తిరిగారు. ఇందులో నిర్మిస్తున్న వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్స్ పార్క్, ఓపెన్ జిమ్, చిల్డ్రన్ ప్లే ఏరియా, కమ్యూనిటీ హాల్, కేఫ్, బాత్ రూమ్స్, వాచ్ టవర్, కంచాలమ్మ గండిలో ఏర్పాటు చేయనున్న బోటింగ్ తదితర అంశాలపై అటవీశాఖాధికార్లతో చర్చించారు. కొండ ఎక్కడానికి, దిగడానికి తయారు చేసిన (ట్రెక్కింగ్) రహదారులను పరిశీలించారు. కొండపైన 15 అడుగుల పగోడా ను ఏర్పాటు చేయాలని, వాకింగ్ ట్రాక్ చుట్టూ సోలార్ లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. సంప్ ఏర్పాటు చేసుకుంటే వెలిగల్లు నీటిని అందిస్తామన్నారు. ఆర్ఒ ప్లాంట్ పనుల పురోగతిపై ఆరా తీశారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సోషల్ ఫారెస్ట్ డిఎఫ్ఒ నాగమల్లేశ్వరి, రేంజ్ అధికారి రఘు శంకర్‌ను వారు ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, మున్సిపల్ కమిషనర్ గంగ ప్రసాద్, స్టేట్ సివిల్ సప్లయిస్ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, వైస్ ఎంపిపి జయపాల్ రెడ్డి, ఫారెస్ట్, పంచాయతీరాజ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హక్కుల సాధన కోసం ఉద్యమించాలి

- బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శంకర్‌రావు

ప్రజాశక్తి-పీలేరు

మాట్లాడుతున్న శంకర్‌రావు

బిసిల హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శంకర్‌రావు, యువజన సంఘం అధ్యక్షులు కుమ్మరి క్రాంతి కుమార్ పిలుపునిచ్చారు. రాయలసీమ పర్యటనలో భాగంగా మంగళవారం వారు పీలేరు వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లైనా బిసిలకు వరిగిందేమీలేదని తెలిపారు. రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకు కోసం బిసిల జపం చేస్తున్నారని ఆరోపించారు. జనాభా ప్రాతిపదికన బిసిలకు అందాల్సిన విద్య, ఉద్యోగాలు, సమాన హక్కులు కాలరాస్తున్నారని ఆరోపించారు. అధికారంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బిసిలకు తీరని ద్రోహం చేశాయన్న ఆవేదన వ్యక్తం చేశారు. కుల గణన విషయంలో కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తిన చందంగా వ్యవహరించడం దురద ృష్టకరమని చెప్పారు. బిసి మంత్రిత్వశాఖలో ఒబిసి మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డాడు.

రేపు పిడిఎస్‌యు జిల్లా మహాసభ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పిడిఎస్‌యు ఉమ్మడి కడప, అన్నమయ్య జిల్లా 4వ మహాసభలు ఈ నెల 30, డిసెంబర్ 1వ తేదీలలో రాయచోటి పట్టణంలో నిర్వహిస్తున్నామని పట్టణ ఉపాధ్యక్షులు ఎన్.పృథ్వీకుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కలాశాల ఆవరణంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు మండల కమిటీ సభ్యులు శివశంకర్, శివకృష్ణ, జగన్, వేద రక్షిత్, చరణ్‌రాజ్ పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థ నిర్వీర్యం :'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాష్ట్రంలో విద్యా వ్యవస్థ నిర్వీర్యమైందని రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు జగన్‌మోహన్‌రాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ పార్లమెంటు క్యాంపు కార్యాలయంలో టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు పోలి శివకుమార్ ఆధ్వర్యంలో విద్యార్థి మేలుకో-భవిష్యత్ మార్చుకో పోస్టర్లను జగన్‌మోహన్‌రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ సిఎం అయ్యాక ఎక్కువ శాతం విద్యార్థులే నష్టపోయారని తెలిపారు. విద్యార్థులకు మేనమామగా ఉంటానని హామీ ఇచ్చి హింస మామగా తయారై విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేశారని విమర్శించారు. అనంతరం జగన్ మోహన్‌రాజును నాయకులు గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు పోలి శివకుమార్, పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వూరు సుబ్రహ్మణ్యం నాయుడు, మండల సీనియర్ నాయకులు జి.వి.సుబ్బరాజు, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సురేంద్ర, రైల్వేకోడూరు నియోజకవర్గ టిఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షులు వల్లెపు శివకుమార్, నాయకులు సుహేల్, సాయి హేమంత్, సుభాన్, దినేష్ వంశీకృష్ణ, మహేష్, సురేష్, అంజి, రమేష్ పాల్గొన్నారు.

చమర్తిని సన్మానిస్తున్న టిఎన్ఎస్ఎఫ్ నాయకులు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-రామాపురం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్‌యార్డ్ చైర్మన్ విశ్వనాథరెడ్డి అన్నారు. మండలంలో ప్రజాసంకల్పయాత్రలో సందర్భంగా నల్లగుట్టపల్లె గ్రామ సచివాలయంలో మంగళవారం ప్రజలతో ముఖాముఖి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అనేక రకాలైన సంక్షేమ పథకాలు ప్రజల కోసం ప్రవేశ పెట్టిందని అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా అధికారులు కృషి చేయాలని చెప్పారు. ప్రధానంగా పెన్షన్లు, పక్కా భవనాలు రైతులకు సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు ప్రజలకు సమాచా రం అందిస్తున్నారని చెప్పారు. నల్లగుట్టపల్లె గ్రామ సర్పంచ్ నాగభూషణ్ రెడ్డి మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ పేరుతో ఏర్పాటు చేసిన ఆరోగ్య పథకం ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఇండియన్ గ్యాస్ అధినేత సివి. సుబ్బారెడ్డి ఉజ్వల కనెక్షన్ కింద పేద ప్రజలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక పంచాయతీ ఇన్‌ఛార్జి సెక్రటరీ సంజీవరెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

రామసముద్రం : మండలంలోని నారిగానిపల్లి, పెద్దకురప్పల్లి పంచాయతిలలో మంగళవారం ఎంపిడిఒ నారాయణ స్వామి అధ్యక్షతన వీక్షత్ భారత్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ కేంద్ర పథకాలు ద్వారా లబ్ధి చేకూరని వారికి ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తుందని తెలిపారు. భారత ప్రధాని నరేంద్రమోదీ ప్రజలకు అందిస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసికెళ్లి అమలు చేయడమే కార్యక్రమ ముఖ్య లక్ష్యంమని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ కార్డులు వలన ఆరోగ్యశ్రీ ద్వారా 5 లక్షల వరకు కార్పొరేట్ ఆసుపత్రిలలో ఉచితంగా వైద్యం పొందవచ్చునని తెలిపారు. ఆరోగ్యశ్రీకార్డు పొందిన వ్యక్తులు బెంగళూరు, చెన్నై , ఢిల్లీ ప్రాంతాల్లో కూడా ఆయుష్మాన్ భారత్ ద్వారా వైద్య సదుపాయం పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ కృష్ణ మూర్తి, మెడికల్ ఆఫీసర్ నూరుల్లా, ఎపిఒ గౌరీ శంకర్ , ఆర్బిఐ కోఆర్డినేటర్ శ్రీనివాస్ నాయక్, ఐసిడిఎస్ సూపర్ వైజర్ చంద్రకాంత, సర్పంచ్ కవిత నరసింహులు పాల్గొన్నారు.

ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ మృతికి ఎమ్మెల్యే సంతాపం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ హాజీ అబ్దుల్ గఫార్ సాబ్ మృతి పట్ల ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి సంతాపం తెలిపారు. రాయచోటి పట్టణంలో గఫార్ సాబ్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీతోనూ, తనతో ఉన్న అనుబంధం గుర్తుకు చేసుకుని అయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయనతోపాటు మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, షబ్బీర్, ఫయాజ్ అహమ్మద్, గౌస్ ఖాన్, పట్టణ కన్వీనర్ రియాజుర్ రెహమాన్ నివాళులర్పించారు.

శరవేగంగా మైదానం అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-నందలూరు

మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతి అరవపల్లి జడ్‌పిఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సీనియర్ క్రికెట్ క్రీడాకారుడు పల్లె గ్రీష్మంతరెడ్డి మాట్లాడుతూ మైదానం మరమత్తుల సమస్య ఎంతో కాలంగా కలగా నిలిచిపోయాయని అన్నారు. పలువురు క్రీడాకారులు నూతన స్టేజి భవనం, స్త్రీలకు, పురుషులకు డ్రెస్సింగ్ రూముల నిర్మాణం, ఇతర మరమ్మత్తుల కొరకు జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి దృష్టికి తీసుకవచ్చారని అన్నారు. ఆయన వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయగా పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్లు గుండు మల్లికార్జున్ రెడ్డి, ఆనాల మధు యాదవ్, క్రికెట్ కోచ్ ఫిరోజ్ ఖాన్ లోడి, సీనియర్ క్రీడాకారులు రంజిత్, గంగయ్య, శాంత పాల్గొన్నారు.

నాగబాబుతో జనసేన నాయకులు

నాగబాబును కలిసిన 'మలిశెట్టి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జనసేన పిఎసి సభ్యులు నాగబాబును మంగళగిరిలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసినట్లు జనసేన అసెంబ్లీ ఇన్‌ఛార్జి మలిశెట్టి వెంకటరమణ తెలిపారు. నియోజకవర్గంలో జనసేన పార్టీని అభివృద్ధి పథంలో తీసుకెళుతున్నట్లు పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని, నియోజకవర్గంలో జనసేన పార్టీని బలోపేతం చేయాలని ఆయన సూచించినట్లు వివరించారు. మలిశెట్టికి జనసేన పార్టీ అధ్యక్షులు, పార్టీ పెద్దల దగ్గర మంచి గౌరవం, గుర్తింపు ఉందని నాగబాబు అన్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో జనసేన రాజకీయ పరిస్థితులను సవి వివరంగా నాగబాబుకు వివరించారన్నారు. అన్ని విషయాలను కూలంకుషంగా అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌కు వివరిస్తామని నాగబాబు చెప్పినట్లు మలిశెట్టి తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర చేనేత కార్యదర్శి రాటాల రామయ్య, నాయకులు భాస్కర్ పంతులు, పోలిశెట్టి రజిని, పోలిశెట్టి శ్రీనివాసులు పాల్గొన్నారు.

విభిన్నప్రతిభావంతులకు ట్రైసైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి-మదనపల్లె

విభిన్నప్రతిభావంతులకు వెలుగు సంస్థ ఆవరణంలో నలుగురు విభిన్నప్రతిభావంతులకు మూడు చక్రాల సైకిళ్లనును అందజేసినట్లు వెలుగు సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్‌రెడ్డి తెలిపారు. కదిరి న్యూ క్రాంతి దివ్యాంగుల యూత్ వెల్ఫేర్ సొసైటీ ఇంతియాజ్ మూడు చక్రాల సైకిలు అవసరమని ఉదయ్ మోహన్‌రెడ్డి అడిగారు. స్పందించిన ఆయన అనంతపురం జిల్లా ఎరికలవాండ్లపల్లె నివాసి ఎట్టల వెంకట నారాయణ, అదే జిల్లా హరూన్ స్ట్రీట్ నివాసి తలమర్ల నియాన్‌ఖాన్, కదిరి, వలిసాబ్ రోడ్ నివాసి షేక్ షాకీర్‌లకు మూడు చక్రాల సైకిళ్లను అందజేసారు.

ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పదో తరగతి పరీక్ష ఫీజుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్న కార్పొరేట్, ప్రయివేట్, ఎయిడెడ్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్‌యు నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో మాసాపేట ప్రభుత్వ ఎస్‌సి హాస్టల్లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో రాయచోటి, రాజంపేట, రైల్వే కోడూరు, మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె ప్రాంతాల్లోని పాఠశాలల యాజమాన్యాలు పదో తరగతి పరీక్ష ఫీజు రూ.125కు బదులు విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా రూ.1500 నుంచి రూ.2 వేల వరకు ఎలాంటి రసీదులు ఇవ్వకుండా వసూలు చేశారని విమర్శించారు. వెంటనే ఆయా పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు, జిల్లా కమిటీ సభ్యుడు ప్రమోద్, హరి పాల్గొన్నారు

కరువు రైతులను ఆదుకుంటాం : జెడి

ప్రజాశక్తి-రామాపురం

ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసి వర్షాలు లేక పంటలు పూర్తిగా ఎండిపోయి నష్టపోయిన రైతులను అన్ని విధాల ఆదుకుంటామని అన్నమయ్య జిల్లా జాయింట్ డైరెక్టర్ అగ్రికల్చర్ చంద్రనాయక్ అన్నారు. మండలంలోని గోపగుడిపల్లి గ్రామ సచివాలయంలో మంగళవారం సాయంత్రం కరువు రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందరరేగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామాలలో ఏడాది ఖరీఫ్ సీజన్లో ఏ పంటలు సాగు చేశారనీ ఏ పంటలు సాగు చేశారని రైతులను అడిగారు. రైతులు మాట్లాడుతూ గ్రామాల్లో ఖరీఫ్ సీజన్లో వేరుశనగ వరి కంది పంటలు సాగు చేసామని అయితే సమయానికి వర్షాలు కురవకోవడంతో బావుల్లో బోర్లలో చెరువుల్లో నీరు లేకపోవడంతో పంటలు పూర్తిగా ఎండిపోయాయని రైతుల ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఏడాది అప్పు చేసి పంటలు సాగు చేస్తే పంట కోతకు వచ్చే సమయానికి బోర్లలో చెరువుల్లో నీరు అడుగంటిపోయాయని. గ్రామాల్లో తాగడానికి ప్రజలకు నీరు లేక పశువులకు నీళ్ల లేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామాల్లో తాగునీరు బోర్లు బావులలో కూడా ఒకటి రెండు మాత్రమే అంతంత మాత్రమే నీరు ఉన్నాయన్నాయని రైతులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విషయంపై జెడి చంద్ర నాయక్ మాట్లాడుతూ ఏడాది రామాపురం మండలం కరువు మండలంగా ప్రభుత్వం ప్రకటించిందని పేర్కొన్నారు. త్వరలో కేంద్ర కరువు బృందం గ్రామాల్లో పర్యటిస్తారని గ్రామాల్లో రానున్న కరువు బ ృందానికి రైతులు తమ విషయాలను వారికి తెలియజేపాలన్నారు. పంటల పైన కరువు కరువు బృందం తాగునీరు, పశు గ్రాసం, ఎండిపోయిన పంటల పైన తదితర విషయాలపై రైతులను అడిగి తెలుసుకుంటారన్నారు. గ్రామాల్లో ఉండే సమస్యలను కేంద్ర బృందం దృష్టికి తీసుకు వెళితే వారు వాటిని నమోదు చేసి పైఅధికారుల దృష్టికి తీసుకువెళ్తారని పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా వరి 390 ఎకరాలు, వేరుశనగ 1439 ఎకరాలు, కంది 20 ఎకరాల్లో పంటలు సాగు చేశారని తెలిపారు. ముఖ్యంగా పశువులు కూడా మేత లేక పశువులు చాలా ఇబ్బంది పడుతున్నాయని వాటికి పశు గ్రాస మంజూరు చేయాలని రైతులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. పంటలు సాగుచేసిన పంటలు ఎండిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతుల దృష్టికి తీసుకువెళ్లారు. జెడిఎ చంద్ర నాయక్ మాట్లాడుతూ కేంద్ర బృందం త్వరలో గోపగుడిపల్లి. సరస్వతి గ్రామాల్లో పర్యటించి కరువు పైన పరిశీలిస్తారని అన్నారు. కార్యక్రమంలో ఎడిఎ జయరాణి. ఎంపిఇఒ బండారు శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

రైతుల సమావేశంలో మాట్లాడుతున్న చంద్రనాయక్

అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే : కలెక్టర్


సుండుపల్లి : జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే మేడా

ప్రజాశక్తి-రాయచోటి

అణగారిన వర్గాల ఆశా జ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే అని కలెక్టర్ గిరీష, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే 133వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని మాసాపేట బ్రిడ్జి వద్ద ఉన్న పూలే విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లతో కలిసి కలెక్టర్, ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యమకర్త, సంఘసేవకుడు, సామాజిక తత్వవేత్త, మహిళా అభ్యుదయ వాది, నిరంతరం మహిళల విద్యాభివృద్ధికి కృషిచేసిన మహాత్మ జ్యోతిరావు పూలేను యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సమాజంలో కుల వివక్ష, అంటరానితనంపై పోరాటం చేసి, వెనుకబడిన బడుగు, బలహీన వర్గాలకు హక్కులు, మహిళలకు విద్యావకాశం కల్పించిన గొప్ప సంఘసంస్కర్త అని పేర్కొన్నారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన దీనజన బాంధవుడన్నారు. సమ సమాజ స్థాపనలో భాగస్వాములు నిత్య స్ఫూర్తి ప్రదాతగా, రంగా రేఖగా నిలిచారని పేర్కొన్నారు. పూలే ఆశయాలను అనుగుణంగా జగన్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేస్తూ వారి ఆర్థికాభివృద్ధికి దోహదపడుతోందన్నారు. బిసి అంటే బ్యాక్ వర్డ్ క్లాస్ కాదు బ్యాక్ బోన్ అని సిఎం జగన్ నిరూపించారన్నారు. 56 బిసి కార్పొరేషన్లు ఏర్పాటు చేసి పాలక మండళ్లను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజ్ రెహమాన్, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, డిసిబిసి డైరెక్టర్ ఎస్.వెంకటరామిరెడ్డి, బిసి సెల్ విజయభాస్కర్, వాల్మీకి సంఘ జిల్లా అధ్యక్షులు గువ్వల బుజ్జిబాబు, నగర ప్రముఖులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. **సుండుపల్లి :** మహాత్మాజ్యోతిరావుపూలే వర్ధంతి సందర్భంగా జ్యోతిరావుపూలే విగ్రహానికి ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతదేశంలో మొదటిసారిగా మహిళల విద్య కోసం పాటుపడిన మహానుభావుడని మనమందరం ఆయన అడుగుజాడల్లో నడవా లని అన్నారు. అట్టడుగు వర్గాల ప్రజలను దోపిడీ వ్యవస్థ అంటరానితనం నుండి విముక్తి చేయడానికి నిరంతరం కృషి చేసిన మహోన్నత వ్యక్తి మహాత్మ జ్యోతిరావు పూలే అని కొనియాడారు. కార్యక్ర మంలో సుండుపల్లి మండల అధ్యక్షురాలు, పార్టీ మండల అధ్యక్షులు, జెసిఎస్ కన్వీనర్లు, వైసిపి ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపిపి, వార్డు మెంబర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** బడుగు, బలహీన వర్గాల ఆశా జ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే అని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి బత్యాల చెంగలరాయుడు పేర్కొన్నారు. పూలే వర్ధంతిని పురస్కరించుకొని జాళిబజారు లోని పూలే విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బత్యాల మాట్లాడుతూ జ్యోతి రావు పూలే గొప్ప సంఘ సంస్కర్త అని, బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం అలుపెరగని పోరాటం చేసిన మహాత్ముడని తెలిపారు. అట్టడుగు వర్గాల ప్రజలకు కూడా రాజ్యాంగ ఫలాలు అందాలని శ్రమించిన గొప్ప వ్యక్తి పూలే అని కొనియాడారు. సూర్య, చంద్రులు ఉన్నంత కాలం ఆయన ప్రజల హృదయాలలో ఉంటారని, ఆయనను స్మరించుకోవడం ప్రతి ఒక భారతీయుడి బాధ్యత అని తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, పట్టణ అధ్యక్షులు డిఆర్ఎల్ మణి, లీగల్ సెల్ అధ్యక్షులు టి.లక్ష్మీనారాయణ, గుగ్గిళ్ళ చంద్రమౌళి, కొండయ్య నాయుడు, మహిళా నాయకురాలు అనసూయమ్మ, మిరియాల జ్యోతి తదితరులు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మాజ్యోతిరావుపూలే అని లక్కిరెడ్డిపల్లి ఆస్పత్రి అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ విజయభాస్కర్ అన్నారు. లక్కిరెడ్డిపల్లి టౌన్ లోని బాబు స్టూడియోలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు మహమ్మద్‌రఫీ, సదుల్లా, బిసి నాయకులు, కృష్ణ తో కలిసి విజయభాస్కర్‌లు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో, మహమ్మద్‌రఫీ, రామచంద్రయ్య, కృష్ణ, సాదుల్లా, వెంకటస్వామి, రాము తదితరులు పాల్గొన్నారు. **మదనపల్లె:** బిసి జనగణన చేపట్టి, బిసిలకు న్యాయం చేసినప్పుడే జ్యోతిరావుపూలే నిజమైన నివాళి అని జనసేన పార్టీ రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామదాస్ చౌదరి అన్నారు. టిడిపి రాజంపేట పార్లమెంటు కార్యాలయంలో జ్యోతిరావు చిత్రపటానికి పూల మాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బల హీన వర్గాల ప్రజలకు ఆత్మ స్థైర్యం కల్పించి వారి సాధికారత కోసం కృషి చేసిన మహనీయుడు పూలే అని తెలిపారు. విద్య వివక్ష, పేదరికం, ఆర్థిక అసమానత్వం నిర్మూలించడానికి ఎంతో కృషి చేసిన మహనీయుడని కొని యాడారు. కుల, మత రహిత సమాజ నిర్మాణానికి ఎనలేని కృషి చేశార న్నారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రదాన కార్యదర్శి జంగాల శివరామ్‌రాయల్, టిడిపి రాజంపేట పార్లమెంటు బిసిసెల్ అధ్యక్షులు పి.సురేంద్రయాదవ్, టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, రాటకొండ మధుబాబు, పూల మురళి, వాల్మీకి సాధికార కన్వీనర్ లక్ష్మన్న, గాండ్ల సాధికార కన్వీనర్ వెంకటరమణ, బెస్త సాధికారిక కన్వీనర్ బొంబాయి దుర్గ, పార్లమెంటు కార్యదర్శి మోహన్ రెడ్డి, ముసలికుంట నాగయ్య, భాస్కర్, అయూబ్ ఖాన్ పాల్గొన్నారు. **బహు జనసేవ ఆధ్వర్యంలో..** బహు బహుజన సేన ఆధ్వర్యంలో స్థానిక చిత్తూరు బస్టాండ్ సర్కిల్‌లో మహత్మ జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నాయ కులు శ్రీచందు మాట్లా డుతూ అంటరానితనం, కుల నిర్మూలన వ్యవస్థ, మహిళా పునరుద్ధరణకు మొదటి అడుగు వేసిన ఏకైక సామాజిక సంస్కర్త అని కొనియాడారు. ఆడపిల్లలకు చదువును పంచిన చదువుల తల్లి సావిత్రిబాయి పూలే దేశంలోనే మొట్టమొదటి గా బడుగు బలహీన వర్గాలు అగ్రవర్ణ పేదల కోసం పాఠశాల ను స్థాపించిన గొప్ప వ్యక్తిగా జ్యోతిరావు పూలే చరిత్రలో నిలిచారని అన్నారు. కుల మతాలకతీతంగా అణగారిన వర్గాల ప్రజల అభ్యున్నతకై పనిచేసే ఈ సంఘంలో అన్ని మతాల కులాల ప్రజలు కూడా పాల్గొనచని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బహుజన సేన టౌన్ ఆటో యూనియన్ ప్రెసిడెంట్ రాఘవేంద్ర యాదవ్, బహుజనసేన జిల్లా సెక్రటరీ రూపక నాయక్, నవీన్‌నాయక్, బహుజనసేన ఆటో యూనియన్ నాయకులు మహేష్,చలపతి,అమర పాల్గొన్నారు.

గుండె జబ్బులకు అత్యాధునిక వైద్యం

- డాక్టర్ శివారెడ్డి

డాక్టర్ శివారెడ్డి

ఆస్పత్రి భవనం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శివారెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లి

గుండెవ్యాధిగ్రస్తులకు అత్యాధునిక వైద్యం అందించడమే తన లక్ష్యమని డాక్టర్ శివారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని సొసైటీ కాలనీలో ఉన్న న్యూ లైఫ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) ఆసుపత్రి నిర్వహకులు డాక్టర్ శివారెడ్డి మంగళవారం ప్రజాశక్తితో మాట్లాడారు. మధ్యతరగతి ప్రజల కోసం గుండె సంబంధిత వ్యాధులకు అత్యంత ఆధునిక వైద్యఎరికరాలతో వైద్య సేవలు అందించేందుకు కోసం తాను మదన పల్లెలో ఆస్పత్రిని ప్రారంభించానని చెప్పారు. ముఖ్యంగా గుండె సంబంధిత వ్యాధఎలైన వారికి ప్రత్యేక చికిత్సలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. అంతకాకుండా ఆస్పత్రి ప్రారంభోత్సవ సందర్భంగా ప్రత్యేక రాయితీలను కల్పించడం జరిగిందని అన్నారు. ఇందులో ఎక్స్ పర్ట్ కార్డియాక్ చెకప్ రూ.3వేలు విలువ గల టెస్టునకు కేవలం కేవలం రూ.999లకు, మాస్టర్ కార్డియాక్ చెకప్ రూ.7వేలు విలువ గల వైద్యపరీక్షలు కేవలం రూ.2999లకు, రూ.8వేలు కార్డియాక్ అండ్ డయాబెటిక్ చెకప్ రూ.39 99లకే చేస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించ ఎకొని గుండె సంబంధిత వ్యాధులను నిర్ధారించుకొనవచ్చునని పేర్కొన్నారు. తమ ఆస్పత్రిలో గుండె సంబంధిత వ్యాధులకు ప్రత్యేక చికిత్సలు అందించడం జరుగుతుందని తెలిపారు. గతంలో గుండె సంబంధిత వ్యాధులను నిర్ధారించుకొనుటకు నిర్వహించే పరీక్షలకు వేలరూపాయలు ఖర్చు చేయాల్సి వచ్చేదని అయితే తమ ఆస్పత్రిలో ప్రారంభోత్సవ రాయితీ కింద ప్రత్యేక డిస్కౌంట్ ధరలను కల్పిస్తు న్నామని చెప్పారు. అంతేకాకుండా 24 గంటలు కేథలాబ్ సర్వీసెస్(యాంజి యోగ్రామ్, యాంజి ప్లాస్టిక్) వంటి గుండె ఆపరేషన్ మిషన్లతో ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నామని అన్నారు. వెంటిలేటర్స్, డయాలసిస్, ఈసీజీ, 2డి ఎకో, టిఎంటి సేవలతోపాటు హెల్త్ చెకప్‌లను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వచ్చే ఎన్నికల్లో టిడిపి గెలుపే లక్ష్యం : మాజీ ఎమ్మెల్యే

సంఘీభావం తెలుపుతున్న టిడిపి, జనసేన నాయకులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని టిడిపి-జనసేన ఆత్మీయ సమావేశంలో నాయకుల తీర్మానించారు. మంగళవారం పట్టణంలోని స్థానిక బెంగళూరు రోడ్డు,షాదీ మహల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే జి.శంకర్‌యాదవ్, ఉమ్మడి చిత్తూరుజిల్లా జనసేన అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజర య్యారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ తంబళ్లపల్లి నియోజకవర్గం అత్యంత వెనుకబడినటువంటి ప్రాంతమని అన్నారు. కుళ్ళు కుతంత్రాలతో కూడిన రాజకీయాలు చేసి ఈ ప్రాంతానికి అభివృద్ధి లేకుండా కుటిల రాజకీయం చేస్తున్నారని అన్నారు. తమ నాయకుడు పవన్‌కల్యాణ్ రాష్ట్రం బాగుండాలని, రాష్ట్ర ప్రజలు బాగుపడాలని ముఖ్య ఉద్దేశంతో పదవులను పక్కనపెట్టి ప్రజలకు మంచి చేయాలనే ఉద్దేశంతో జనసేన, టిడిపి ఉమ్మడి కార్యాచరణకు శ్రీకారం చుట్టారన్నారు. జి శంకర్‌యాదవ్ మాట్లాడుతూ తాను ఒక నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తినని ఒబళ్లపల్లి అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడ్డానన్నారు..జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్ విలువలతో కూడిన రాజకీయాలు చేయాలనే ముఖ్య ఉద్దేశంతో రాజకీయాల్లోకి అడుగు పెట్టారని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జర్వర్ గురువారెడ్డి, జనసేన రాష్ట్ర కార్యదర్శి సుహాసిని, నియోజకవర్గ జనసేన సాయినాథ్, నియోజకవర్గ పోల్ అబ్జర్వర్ కుడుం శ్రీనివాసులు, ఆరు మండలాల పార్టీ అధ్యక్షులు నారాయణస్వామిరెడ్డి, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

భూపేష్‌రెడ్డి చొరవతో కెసి కెనాల్‌కు నీరు విడుదల

పెద్దముడియం : మండలం పరిధిలోని శుద్దపల్లె, జంగాలపల్లె, జె.కొట్టాలపల్లె, ఉప్పలూరు గ్రామ రైతుల పొలాలకు జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి చొరవతో అధికారులు కెసి కెనాల్‌కు నీరు విడుదల చేశారు. పంటలు ఎండుతున్నాయని రైతులు భూపేష్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. ఇందుకు స్పందించిన ఆయన ఆళ్లగడ్డ మండలం లింగందిన్నె గేట్ నెంబర్ 27 దగ్గరికి వెళ్లి డిఇతో మాట్లాడి నీరు విడుదల చేయించారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ కడప జిల్లా వాసి ముఖ్యమంత్రిగా ఉండి అధికారులతో మాట్లాడి నీరు విడుదల చేయించకపోవడం బాధాకరమన్నారు. నీరు విడుదల అనంతరం రైతులు భూపేష్‌రెడ్డిని, అధికారులను అభినందించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, ఇంజనీర్ రమణ, లస్కర్ ఓబులేసు, పెద్దముడియం మండలం రైతులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. జంగాలపల్లి, ఉప్పులూరులో భూపేష్‌రెడ్డి భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో బాండ్లను పంపిణీ చేశారు.

మరో హామీని నిలబెట్టుకున్న సిఎం జగన్ : ఎమ్మెల్యే

బ్రహ్మంగారిమఠం : మండలంలోని మల్లెపల్లె గ్రామ పంచాయతీలోని చెంచయ్యగారిపల్లె గ్రామంలో వైఎస్ఆర్ జలకళ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉచితంగా బోర్లు వేసే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎపిలో జగన్ సర్కార్ సంక్షేమ పథకాలతో దూసుకెళుతోందన్నారు. తాజాగా రైతుల కోసం మరో కీలకమైన హామీని నెరవేర్చిందన్నారు. నవరత్నాల్లో రైతులకు ఉచిత బోర్‌వెల్‌పై ఇచ్చిన హామీ మేరకు బోరుబావుల తవ్వకం కోసం వైఎస్ఆర్ జలకళ పథకానికి శ్రీకారం చుటిందని వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి వీరనారాయణరెడ్డి, అడిషనల్ పీడీ నాగరత్నమ్మ, ఎంపిడిఒ వెంగమునిరెడ్డి, మండల కన్వీనర్ రత్నకుమార్ యాదవ్, సింగిల్ విండో చైర్మన్ సుబ్బారెడ్డి, ఎపిడి జుబేదా, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్‌తో 'గంగవరం' భేటీ

ఎర్రగుంట్ల : పట్టణంలోని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, సీనియర్ నేత నడిఊరికి చెందిన సూర్యనారాయణరెడ్డితో మంగళవారం వైసిపి రెబెల్ నాయకుడు గంగవరం శేఖర్‌రెడ్డి భేటీ అయ్యారు. 2019 ఎన్నికల్లో సుధీర్‌రెడ్డికి మద్దతుగా పనిచేసిన సూర్యనారాయణరెడ్డి ఆయన సోదరుడు మాజీ ఎంపీటీసీ బాల నారాయణరెడ్డి కొంతకాలంగా ఎమ్మెల్యేకు దూరంగా ఉంటున్నారు. ఈ సమయంలో గంగవరం శేఖర్‌రెడ్డి సూర్యనారాయణరెడ్డిని తన స్వగృహంలో కలిశారు. వైసిపి రెబెల్ నాయకులు ఒకటవుతున్నారనే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా రెబల్ నాయకులను ఒక్క తాటిపైకి తెచ్చే ఆలోచనలో గంగవరం ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో వీరి కలయిక పట్టణంలో రాజకీయంగా వేడి వాతావరణాన్ని సృష్టిస్తోందని చెప్పవచ్చు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

సింహాద్రిపురం : మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ విజయ్‌రామరాజు సూచించారు. సింహాద్రిపురంలో జరుగుతున్న సిసి రోడ్లు, అండర్ డ్రయినేజీ, పోలీస్‌స్టేషన్, తహాశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయం, పార్కు, ఆర్టీసీ బస్టాండు తదితర పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిశంబర్ 25న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వీటిని ప్రారంభిస్తారన్నారు. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు పనులు వేగవంతం చేయాలన్నారు. పనుల నాణ్యతలో ఎలాంటి రాజీలేకుండా చేపట్టాలని అధికారులకు సూచించారు. పాడ ఓఎస్‌డి అనిల్ కుమార్‌రెడ్డి, ఆర్డీవో వెంకటేశ్వర్లు, ఆర్అండ్‌బి ఇఇ మహేశ్వర్‌రెడ్డి, డిఇ జగదీశ్వర్‌రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీవో కృష్ణమూర్తి, తహాశీల్దార్ మహబూబ్ బాషా, వైసిపి జిల్లా కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఎంపీతో మాట్లాడుతున్న రాజేంద్రనాథరెడ్డి

ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన ఎంపిపి

ప్రజాశక్తి-వీరబల్లి

రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని మంగళవారం వీరబల్లె మండల ఎంపిపి గాలివీటి రాజేంద్రనాథరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మండలంలోని కొన్ని సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఎంపీ సమస్యలపైసానుకూలంగా స్పందించి త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కరిస్తానని హామీనిచ్చినట్లు తెలిపారు. పెద్దివీడు శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేయాని కోరగా వెంటనే స్పందించి దేవాలయ శాఖ మంత్రితో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. వంగిమళ్లలో పవర్ ప్రాజెక్ట్ కోసం భూములు కోల్పోయిన రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని చెప్పారని తెలిపారు. అనంతరం మండలంలోని పలు గ్రామాలలో సిసి రోడ్లు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వెంటనే సిసి రోడ్లు మంజూరు చేయాలని అభ్యర్థిగా తక్షణమే స్పందించిన ఎంపీ కచ్చితంగా మంజూరు చేస్తానన్నారు. కార్యక్రమంలో పెద్దివీడు సచివాలయం కన్వీనర్ తాటికుంట్ల విశ్వనాథరెడ్డి, వంగిమల్ల సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, వైసిపి నాయకులు రెడ్డయ్య రెడ్డి పాల్గొన్నారు.

టిడిపి బిసిల పార్టీ

ప్రజాశక్తి-కలికిరి

టిడిపి అంటేనే బిసిల పార్టీఅని రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత బిసి సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పట్టించారని, ఆదరణ పథకం కింద బీసీలకు ఇచ్చే సంక్షేమ పథకాలు రద్దు చేసి బిసిలకు తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. టిడిపి ప్రభుత్వంలో ఆదరణ పథకం కింద పనిముట్లు ఇచ్చి బిసిలను కులవృత్తి చేసుకునే వారిని ఆదరించారని, బిసి రిజర్వేషన్ 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించి 1600 పై చిలుకు రాజ్యాంగ పదవులు బిసిలను దూరం చేసింది వైసిపేనే అని అన్నారు. 13 బిసి భవనాల నిర్మాణం నిలిపివేశారని, 30 పైచిలుకు బిసి పథకాలు రద్దు చేశారని చెప్పారు. కేవలం తన సొంత సామాజిక అభివృద్ధి లక్ష్యంగా పదవులు కట్టబెట్టారని విమర్శించారు. 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని గొప్పగా చెప్పుకునే ఈ ముఖ్యమంత్రి కార్పొరేషన్ చైర్మన్లు నాలుగు సంవత్సరాలుగా కేవలం ఉత్సవిగ్రహాలుగా మిగిలిపోయారని, ఒక్క రూపాయి నిధులు కూడా ఇవ్వలేదని అన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో రజక, చేనేత, గౌడ, కల్లుగీత, ఎంబిసి కులాలకు వారి వారి వృత్తికి అనుగుణంగా రాయితీలు కల్పించి, వారి అభివృద్ధికి నిధులు కేటాయించి ప్రోత్సహించారని అన్నారు.

సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

వైసిపిని మరోమారు ఆదరించండి

ప్రజాశక్తి-చిన్నమండెం

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపిని మరోమారు గెలిపించుకొని వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మరల ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సర్పంచ్ లక్ష్మణ రెడ్డి, ఎంపిటిసి శ్యామ్ చంద్రలు పేర్కొన్నారు. మంగళవారం కొత్తపల్లి సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు అవసరం కార్యక్రమాన్ని నిర్వహించారు.ముందుగా పార్టీ కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. ప్రజల వద్దకు వెళ్లి నాలుగున్నరేళ్లలో అందించిన సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కుల,మత, రాజకీయాలకు అతీతంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేసిన సిఎం జగన్‌ను 2024లో మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పెద్ద రెడ్డెప్ప రెడ్డి, పంచాయితీ సెక్రటరీ సుమిత్రమ్మ, వెల్ఫేర్ అసిటెంట్ శంకరయ్య , జెసిఎస్ మండల కన్వీనర్ చుక్కా అంజనప్ప, వైసిపినాయకులు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి:** రాష్ట్రప్రజలకు అన్ని విధాల మేలు జరగాలంటే మళ్లీ వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. కుక్కరాజుపల్లెలో గ్రామ సచివాలయంలో వై ఏపి నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సర్పంచ్ రామరాజు, వైస్ ఎంపిపి అనసూయమ్మ ఆధ్వర్యంలో జరిగింది. స్థానిక ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేశారన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలతో పాటు ప్రతిపల్లెకు రోడ్లు, మౌలిక వసతులు కల్పించిన ఘనత ద్వారకానాథ్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో చైర్మన్ భార్గవ్ రెడ్డి, నాయకులు శ్రీరాములు, పద్మనాభరెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

పర్యాటకులను ఆకర్షించాలి

జమ్మలమడుగు రూరల్ : పర్యాటకులను ఆకర్షించేలా వివిధ యాజమాన్యాలు కృషి చేయాలని జిల్లా పర్యాటక శాఖ అధికారి మల్లికార్జున సూచించారు. మండల పరిధిలోని గండికోట గ్రామంలోని హరిత టూరిజంలో మంగళవారం స్థానిక సర్పంచ్ కె.గురుఈశ్వర్ అధ్యక్షతన స్వదేశీ సందర్శన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వదేశీ సందర్శన్ కార్యక్రమంలో గండికోట పర్యాటక ప్రదేశం ఎంపికైందన్నారు. ఇక్కడి హోటల్ నిర్వాహకులు, వ్యాపారస్తులు, గైడ్స్ కొన్ని మెలకువలు పాటించాలన్నారు. వచ్చిన ప్రతి పర్యాటకుడు మళ్లీ వచ్చేలా చేయడంలో మీ కృషి వెలకట్టలేనిదన్నారు. చక్కటి సంస్కృతి, మర్యాద, మాటతీరు, ప్రవర్తన, వేషధారణ బాగుండాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుతూ ఇక్కడి ప్రాంతంపై చక్కటి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ హరిత, సర్పంచ్ గురుఈశ్వర్ రాయల్, హరిత హోటల్ మేనేజర్ మురళి రాయల్, స్వదేశీ సందర్శన్‌పై ప్రసంగించారు. కార్యక్రమంలో అఖిల్, వీరప్రసాద్, హుస్సేన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : ఎయిడ్స్ వారోత్సవాల సందర్భంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎయిడ్స్, హెచ్ఐవిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపి ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, డిఏపి సియు జిల్లా వారి ఆదే శాల మేరకు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని కృషి స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వ ర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. కార్యక్ర మంలో ప్రిన్సిపల్ సాయి శేఖర్ రెడ్డి, కౌన్సిలర్ చంద్ర మోహన్, బాలాజీ పాల్గొని విద్యార్థులకు ఎయిడ్స్ అవగాహన కల్పించారు. ఎయిడ్స్ రోగులను అంటరానివారి చూడ కుండా వారిపై ప్రేమ, అభిమానం చూపించి ధైర్యం నింపాలని తెలిపారు.

మహారాజశ్రీ డిప్యూటి రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ ఆర్బిట్రేషన్, చిత్తూరు
DRCF.334/2022
కవిటేశ్వర్ చిట్స్ Ind Pvt.Ltd, మదనపల్లి R/by its బ్రాంచ్ మేనేజర్, మదనపల్లి ...డిస్పూటెంట్
VS
షేక్ షమీమ్ & ఇతరులు ...అపోనెంట్స్
అపోనెంట్ నెం.1 కు నోటీసు
Opp No.1 షేక్ షమీమ్ W/o ఖాదర్ వల్లీ, వయస్సు 51 సంవత్సరాలు,ముస్లిం, వ్యాపారం వలన జీవనం, డోర్ నెం.2-250-E-4-2E, రెడ్డీస్‌కాలనీ, మదనపల్లె, టౌన్, చిత్తూరు జిల్లా
డిస్పూటెంట్ డిస్పూట్ బాకీ మొత్తం రూ.2,04,280/- లు రాబట్టు కొనుటకుగాను మీ పైన దాఖల చేసిన డిస్పూట్‌లో అపోనెంట్ నెంబరు.1 అయిన నీవు 30/11/2023వ తేదిన ఉదయం 11.00 గంటలకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, ఆఫీస్ ఆఫ్ ది డిప్యూటీ రిజిస్ట్రార్ అండ్ స్టాంప్స్ డిపార్ట్మెంట్,ఓల్డ్ కలెక్టరేట్ ఆఫీస్,చిత్తూరు నందు హాజరై ఎటువంటి అక్షేపణలు వున్న యెడల తెలుపుకోవలయును. అట్లు లేనియెడల నీ వరోక్షముగ డిస్పూట్ తీర్మానించబడును.
By order of the Hon'ble Deputy Registrar of Chits/ Orbitrator,Chittoor O/o The District Registrar of Stamps Department, Old Collector Office,Chittoor

ఇంటింటి ప్రచార కార్యక్రమంలో టిడిపి నాయకులు

టిడిపితోనే రాష్ట్ర భవిష్యత్తుకు గ్యారంటీ

ప్రజాశక్తి-నందలూరు

టిడిపి ప్రభుత్వ హయాంలోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారంటీ ఉంటుందని టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ పసుపులేటి దుర్గ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్ర మాన్ని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని తోట పాలెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే తల్లికి వందనం పథకం ద్వారా ఎంతమంది పిల్లల్ని చది వించినా అంతమందికి ఏడాదికి రూ.15వేలు చొప్పున అందిస్తామన్నారు. ఆడబిడ్డనిధి కింద ప్రతి మహిళకు నెలకు రూ.1500, జిల్లా వ్యాప్తంగా మహి ళలకు ఉచితంగా ఆర్‌టిసి బస్సు ప్రయాణం, యువగళం నిధి కింద నిరుద్యో గులకు నెలకు 3వేలు, అన్నదాత పథకం కింద రైతులకు పెట్టుబడి సాయం 20వేలు, కుటుంబానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గౌస్ బేగ్, భీమ మునిస్వామి, శ్రీనివాసులు, నారపు శెట్టి శివ, గంధం గంగాధర్, పునగాని రాముయాదవ్, నవీన్ పాల్గొన్నారు.

వాలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల వ్యాప్తంగా ఐదు వాలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఎంపిడిఒ రఘురాం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వత్తలూరు1, రెడ్డిపల్లి 2, అనంతయ్యగారిపల్లి 2, పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆసక్తిగల అభ్యర్థులు డిసెంబర్ 8వ తేదీ వరకు అని తెలియజేశారు.8,9 తేదీలలో దరఖాస్తు ఫారాలను పరిశీలిస్తారని, 11,12 తేదీలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు 15న నియామక పత్రాలు అందిస్తారని తెలిపారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట

ప్రజాశక్తి - ఖాజీపేట

వైసిపి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని రంగాపురం గ్రామంలో మంగళవారం రైతు భరోసా కేంద్రం, వైయస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అలాగే పత్తూరులో వైయస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్‌తోపాటు ఆంధ్రప్రదేశ్ కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే, ఆయన తనయుడు మైదుకూరు నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలన ఆదర్శనీయమన్నారు. రైతుల సంక్షేమానికి, ప్రజల ఆరోగ్య రక్షణకు సిఎం ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు వైసిపికే ఓటు వేసి, వేయించి గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఏపీఐఐసి రాష్ట్ర డైరెక్టర్ దుగ్గిరెడ్డి గంగాధర్‌రెడ్డి, అగ్రహారం సహకార సంఘం అధ్యక్షుడు రాఘవరెడ్డి, ఎంపీపీ అబూబకర్ సిద్దిక్, జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు అచ్చుకట్ల కరీముల్లా, ఉప మండల అధ్యక్షుడు చంద్రభాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు దొరవారి రాముడు, మండల పరిషత్ కో- ఆప్షన్ సభ్యులు ముల్వర్ హుస్సేన్, ఆంజనేయ కొట్టాల వైసిపి నాయకులు పెద్దిరెడ్డి, సచివాలయ కన్వీనర్ గోపాల్‌రెడ్డి, అప్పనపల్లి ఎంపీటీసీ బండి శ్రీనివాసులు, దుంపలగట్టు సర్పంచ్ రెడ్యం రామకృష్ణారెడ్డి, సర్పంచులు పట్టు పోగుల లక్ష్మయ్య, గడ్డం రేణుక, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

దేశ పురోభివృద్ధికి ఓటు వజ్రాయుధం

ప్రజాశక్తి - వేంపల్లె

దేశ పురోభి వృద్ధికి ఓటు వజ్రాయుధం వంటిదని తహాశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక వైఎస్ఆర్ వివే కానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఓటు నమోదు కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తహాశీల్దార్ మాట్లాడుతూ ఓటును ప్రతి యవత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటుతోనే మంచి నాయకుడ్ని ఎన్నుకునే వీలుం టుందన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి యవతి, యువకుడు ఓటును నమోదు చేసుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లో ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించే బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు, డిప్యూటీ తహాశీల్దారు శివలక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ డాక్టర్ సతీష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఓబుల్‌రెడ్డి, చరిత్ర శాఖ విభాగాధిపతి బాలగొండ గంగాధర్, డాక్టర్ రామకృష్ణ, అధ్యాపకులు, పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు లబ్ధి : ఎంపిపి

ప్రజాశక్తి - చాపాడు

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని ఎంపిపి టి.లక్ష్మయ్య తెలిపాఉ. మండల పరిధిలోని చిన్నగురువలూరు గ్రామంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని సచివాలయంలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎంపిపి, మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రభుత్వం చేపట్టిన మంచిని ప్రజలకు వివరించాలని తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి పది ప్రశ్నల నియమావళిని చదివి సమాధానాలను నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, కుచ్చుపాప సర్పంచ్ సుబ్బారెడ్డి, వైసిపి నాయకులు యల్లారెడ్డి, సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నెలకొన్నాయని మైదుకూరు మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర పేర్కొన్నారు. నంద్యాల రోడ్డులోని సీతారామాంజనేయ నగర్‌లోని 11వ సచివాలయం పరిధిలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, మేనేజర్ పరమేశ్వర్‌రెడ్డి, రవి, భూమిరెడ్డి సుబ్బరాయుడు, వేపరాల సుబ్బారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విజ్ఞానంతో మూఢనమ్మకాలను విడనాడాలి

ప్రొద్దుటూరు : ప్రతి ఒక్కరూ విజ్ఞానం పెంచుకొని, శాస్త్రీయంగా ఆలోచించి మూఢనమ్మకాలను విడనాడాలని జనవిజ్ఞాన వేదిక(జెవివి)పట్టణ అధ్యక్షుడు పోలంకి శ్రీరాములు అన్నారు. స్థానిక జిన్నారోడ్డులోని మున్సిపల్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. మూఢనమ్మకాల వల్ల ఎన్నో అనర్థాలు జరిగాయని తెలిపారు. అక్షరాస్యత తక్కువగా ఉన్న రోజుల్లో ఇలాంటివి తరచూ చోటుచేసుకుంటూ ఉండేవని గుర్తు చేశారు. ప్రతి అంశాన్ని శాస్త్రీయంగా ఆలోచించినప్పుడే ఇలాంటి మూఢనమ్మకాలకు చోటుండదన్నారు. దేశంలో ప్రతి ఒక్కరికీ ప్రాథమిక హక్కులున్నాయని, అనంతరం జెవివి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ సురేష్ మాట్లాడుతూ చెకుముకి మండలస్థాయి సంబరాల సమావేశం గురించి వివరించారు. కార్యక్రమంలో సహాయ ప్రధానోపాధ్యాయురాలు మునెమ్మ, సోషియల్ టీచర్ చాంద్‌బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చెక్ బౌన్స్ కేసులో వ్యక్తికి జైలు శిక్ష

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

చెక్ బౌన్స్ కేసులో తిరుపతి జగన్నాథం అనే వ్యక్తికి ఆరు నెలలు జైలు శిక్ష విధించినట్లు న్యాయవాది బాలాజీరెడ్డి తెలిపారు. తిరుపతి జగన్నాథ అనే వ్యక్తి బండ్రేవు దస్తగిరికి సెప్టెంబర్ 2, 2021లో చెల్లని చెక్కు ఒకటి రూ.25వేలకు చెక్కు ఇచ్చినందుకు దస్తగిరి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసునమోదయిందన్నారు. ఈకేసు కు సంబంధించి మంగళవారం లక్కిరెడ్డిపల్లి సివిల్ కోర్టులో జడ్జి తుది తీర్పు ఇచ్చినట్టు న్యాయవాది తెలిపారు. శిక్షతోపాటు చెల్లని చెక్కు సంబంధించిన మొత్తాన్ని తిరిగి ఇవ్వాలని తీర్పువెల్లడైనట్లు ఆయన తెలిపారు.